మత్స్యకార భరోసాతో చేయూత

- మత్స్యకారులకు అండగా ప్రభుత్వం
- ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున సాయం



కాట్రేనికోనలో మత్స్యకార భరోసా చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు, ఎంపీ అనురాధ తదితరులు

అమలాపురం రూరల్: చేపల వేట నిషేధ సమయంలో జీవనోపాధిని కోల్పోతున్న గంగపుత్రులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండంత అండగా నిలబడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచేందుకు వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల జాబితాలను వలంటీర్ల సహకారంతో సాగరమిత్రలు గతంలోనే గుర్తించారు. ఆయా జాబితాల ఆధారంగానే లబ్ధిదారులకు జీవన భృతిని అందజేశారు.

6,387 మంది లబ్ధిదారులకు సాయం

వైఎస్సార్ భరోసా పథకానికి 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసున్న మత్స్యకారులు తమ తెల్లకార్డు, ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అవినీతికి ఆస్కారం లేకుండా తుది జాబితా సిద్ధం చేశారు. మెకనైజ్డ్, ఇంజిన్ బోట్లను పరిశీలించి ఆయా బోట్ల వద్ద యాజమానితో పాటు లబ్ధిదారుల ఫొటోలు తీసి లబ్ధిదారుల్ని ఎంపిక చేశారు. కాట్రేనికోన, ఐ.పోలవరం, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, ముమ్మిడివరం మండలాల్లో బోట్ల ద్వారా వేట సాగిస్తున్న 6,387 మంది లబ్ధిదారులను మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. వారికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ప్రభుత్వం జీవనభృతి చెల్లించింది. అల్లవరం మండలంలో 795 మంది, ఉప్పలగుప్తం మండలంలో 138 మంది, అమలాపురం మండలంలో 25 మంది, ఐ.పోలవరం మండలంలో 1802 మంది, కాట్రేనికోన మండలంలో 3,534 మంది, ముమ్మిడివరం మండలంలో 153 మంది మత్స్యకారులకు ప్రభుత్వ సాయం అందింది. ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా వేట నిషేధ సమయంలోనే సాయం అందిస్తుండడంపై మత్స్యకారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న మాకు భరోసా కల్పించారు



గతంలో నిషేధం ముగిసిన రెండు మూడు నెలలకు మొక్కుబడిగా సాయం అందించేవారు. కాని జగనన్న అధికారంలోకి వచ్చాక మత్స్యకారులు ఇబ్బంది పడకుండా వేట నిషేధ సమయంలోనే రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేసి భరోసా కల్పిస్తున్నారు.

– కర్రి లోవరాజా, ఓడలరేవు, మత్స్యకారుడు

అర్హులందరికీ మత్స్యకార భరోసా



వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా గంగపుత్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాబితాలను రూపొందించి అర్హులందరికీ మత్స్యకార భరోసా అందజేశాం. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుంది.

– చిట్టూరి గోపాలకృష్ణ, ఎఫ్‌డీవో, అమలాపురం

క్లుప్తంగా

ఎమ్మెల్సీ కుడుపూడికి సత్కారం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ విశ్వ బ్రాహ్మణ నేతలు

అమలాపురం టౌన్: ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన కుడుపూడి సూర్యనారాయణరావును స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయంలో వైఎస్సార్ సీపీకి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం నేతలు ఆదివారం ఉదయం ఘనంగా సత్కరించారు. సూర్యనారాయణరావుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై ముఖ్యమంత్రి జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ నేతలు తాళాబత్తుల లక్ష్మణరావు, భరణీకాన బాబు, కట్టోజు రాము, వరదా సత్తిబాబు, డి.సాయిబాబు, ముదపాక నాగబాబు, వీర్ని శేషు, బొల్లోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు మెహర్‌బాబా నూతన భవనం ప్రారంభం

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరం పంచాయతీ పరిధి బాబాపురంలో నూతనంగా నిర్మించిన అవతార్ మెహర్ బాబా భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. నూతన భవనాన్ని ముఫజ్జల్ ఫకీ ప్రారంభిస్తారని, అనంతరం సప్తవర్ణ పతాక అవిష్కరణ ఉంటుందని చెప్పారు. మెహర్ బాబా భక్తులంతా హాజరు కావాలని కోరారు.

వీరేశ్వరుని సన్నిధిలో ఆర్‌డీఓ దంపతులు



వీరేశ్వరస్వామి సన్నిధిలో ఆర్‌డీఓ వసంతరాయుడు దంపతులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారిని అమలాపురం ఆర్‌డీఓ ఎస్‌వీజీ వసంతరాయుడు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆర్‌డీఓ దంపతులకు ఆలయ పర్యవేక్షకులు బి.వీరభద్రరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను కలిసిన ఐక్య వేదిక నాయకులు



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న కోరుకొండ మాదిగ ఐక్య వేదిక నాయకులు

అల్లవరం: కోరుకొండ గ్రామానికి చెందిన మాదిగ ఐక్యవేదిక నాయకులు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను అల్లవరం మండలం గోడిలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. 70 ఏళ్ల చరిత్రలో శాసనమండలిలో మాదిగలకు చోటు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇండగమిల్లి సత్యనారాయణ, వేమగిరి శివ, మద్దాల చంటి, పైడిమల్ల ధనరాజు, ఏడిద పండు, అంగర సాయి, వెంకట్, నాని, మోహన్, శేషు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పని భారం తగ్గించాలి

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్మికులపై పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులను శానిటేషన్ కార్యదర్శులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కమిషనర్ కార్మికులకు సమయం మార్పు చేసినా కొంత మంది సెక్రటరీలు యథావిధిగా పనిచేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

తాళ్లరేవు: వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. ఆదివారం తాళ్లరేవు బైపాస్ కేశవస్వామి కాలనీ వద్ద ఏర్పాటుచేసిన అరుణ ఫుడ్ కోర్టును వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు నందికోళ్ల శ్రీదేవి, సర్పంచ్‌లు వెంటపల్లి నూకరాజు, పేర్ని ఆదినారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, పెయ్యల రమేష్, విశ్రాంత జేడీ పెట్ల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ పిల్లారాయ సేవలు ప్రశంసనీయం

ఆర్‌ఏఓ మునిస్వామి



ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: యానాం లయన్స్ క్లబ్ పిల్లారాయ సామాజిక సేవా దృక్పథం అభినందనీయమని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ పిల్లారాయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం లయన్స్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం, విద్యాభివృద్ధికి సంబంధించిన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు చేరువకావొచ్చన్నారు. అనంతరం మెగా వైద్య శిబిరంలో గుండె, గొంతు, ప్రసూతి, చెవి, ముక్కు, ఎముకలు, బీపీ, మధుమేహ వ్యాధులకు నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో 259 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ సతీమణి లక్ష్మీస్నేహ, వైద్యులు డాక్టర్ డీఏన్ఎస్ ప్రకాష్, కె.సత్యసౌజన్య, నితీష్‌సింగ్, గురుకిరణ్, అంజని, ఎస్పీ రఘునాయగం, సివ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



పుదుచ్చేరి స్టేట్ లెవల్ కోఆర్డినేషన్ కమిటీ ఆన్ క్రాప్ ఇన్సూరెన్స్ సమావేశం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎల్‌సీసీఐ సభ్యుడు మాతేటి సత్యభాస్కర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన 38వ పుదుచ్చేరి స్టేట్ లెవల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆన్ క్రాప్ ఇన్సూరెన్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2020 ఖరీఫ్ పంటకు సంబంధించి 31 మంది రైతుల క్లెయిమ్‌లు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. పంటకోత ప్రయోగానికి సంబంధించి మొబైల్ యాప్ ఇప్పటివరకూ యానాం రీజియన్‌లో అమలుకాలేదన్నారు.

అధికారులు పాత సమాచారాన్నే నమోదు చేస్తున్నారని, సమగ్రమైన సాంకేతిక శిక్షణ కలిగిన సిబ్బంది లేరని వివరించారు. సమావేశం అనంతరం వ్యవసాయ కార్యదర్శి ఎల్.కుమార్‌కు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎల్.కుమార్, ఆర్థిక కార్యదర్శి జవహర్, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలగాంధీ తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ సత్కారం



అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్‌ను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక బులియన్ అసోసియేషన్ భవనంలో ఆదివారం సాయంత్రం సత్కరించి అభినందించారు. దుబాయ్‌లో జరిగిన ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో 20 దేశాలు పాల్గొనగా దేశానికి 58 సంవత్సరాల తర్వాత స్వర్ణ పతకం సాధించి పెట్టిన సాత్విక్ సాయిరాజ్ మన అమలాపురం కుర్రోడు కావడం మనందరికీ గర్వ కారణమని చాంబర్ ఆఫ్ కామర్స్ ముఖ్య సలహాదారులు నల్లా పవన్‌కుమార్, కంచిపల్లి అబ్బులు అన్నారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ఉపాధ్యక్షుడు చిట్టూరి పెదబాబు, ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, రాయుడు నాని, రేకపల్లి సూరిబాబు, నంబూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి

అమలాపురం టౌన్: అవగాహనతోనే ఎయిడ్స్ సమూలంగా నిర్మూలించి ఆ భూతాన్ని సమాజం నుంచి పూర్తిగా తరిమేయొచ్చని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీహెచ్ భారతలక్ష్మి అన్నారు. 39వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ మెమోరియల్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ వైద్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చైతన్యం, అవగాహనతో ఎయిడ్స్‌ని తరిమేద్దాం అంటూ నినాదాలు చేశారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఇంటిగ్రేటెడ్ కౌన్సిల్ అండ్ ట్రీట్‌మెంట్ సెంటరు(ఐసీటీసీ) ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆడమ్స్, స్నేహిత, విహాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ పోటీల్లో రాముకు బహుమతి



తెలంగాణా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న రాము

అమలాపురం రూరల్: హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీల్లో అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము బహుమతి అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో చిత్రకారుడు రాముకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణ బహుమతి అందజేశారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



అమలాపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెడుతున్న ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు

అమలాపురం టౌన్: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక నల్ల వంతెన వద్ద, పితాని వారిపాలెం వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహాలకు ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రుద్రరాజు చేతుల మీదుగా రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, ముషిణి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పోలమ్మ చెరువు గట్టు వద్ద గల బుద్ధ పార్కులో స్థానిక కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యానాం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని ఆదివారం యానాంలో సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ బీచ్ పార్క్‌లో నెలకొల్పిన నిలువెత్తు రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, సీవ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి భట్లుపాలెంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఘనంగా గ్రామ దేవత జాతర



సోమాలమ్మను దర్శించుకుంటున్న సర్పంచ్ ఊర్మిళాదేవి దంపతులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో కొలువై ఉన్న గ్రామదేవత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. స్థానిక సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఆత్మహత్యకు ఉపక్రమిస్తుండగా అడ్డుకున్న పోలీసులు



శ్రీహరిని బంధువులకు అప్పగిస్తున్న యానాం పోలీసులు

యానాం: యానాం-ఎదుర్లంక వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన వ్యక్తిని అతడి బంధువులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై అడ్డుకున్న వైనమిది. ఎస్‌ఐ శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ సమీపంలోని మాధవపట్నానికి చెందిన గుబ్బల శ్రీహరి అలియాస్ శ్రీను వెల్డింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. మాధవపట్నంలో స్నేహితులు ఇచ్చిన పార్టీలో పాల్గొని ఇంటికి వెళ్లగా అతడి భార్య మద్యం ఎందుకు తాగారని ప్రశ్నించడంతో ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీహరి యానాం వంతెన వద్దకు వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని యానాంలో ఉన్నానని చెప్పాడు. దీంతో శ్రీహరి బంధువులు యానాం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసులు అప్రమత్తమై శ్రీనును గాలించి వంతెనపై పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి శ్రీనును బంధువులకు అప్పగించామని ఎస్‌ఐ నూకరాజు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



సంజయ్(ఫైల్)

యానాం: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన ఘటన దరియాలతిప్పలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దరియాలతిప్ప బాలయోగి కాలనీకి చెందిన అలపాటి సంజయ్(17) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ నెల 13న స్థానికంగా ఉన్న సీతారామనగర్‌లో సంఘాల ఫ్యాక్టరీ ఆవరణలో సంజయ్ తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా అగ్గిపాడ పాము కరిచింది. అతడిని యానాం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఏఎస్‌ఐ రేఖాడి నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బార్బర్ షాపు తొలగించాలని నిరసన

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో తమ ఇంటి ముందు ఆకస్మాత్తుగా పెట్టిన బార్బర్ షాపు తొలగించాలని యాళ్ల సత్యనారాయణ కుటుంబీకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 13న అర్ధరాత్రి వేళలో సెలూన్ షాపు నిమిత్తం ఒక బడ్డీని తీసుకొచ్చి తమ ఇంటి ముందు అక్రమంగా పెట్టారన్నారు. దీనిపై గత వారం స్పందనలో, అనంతరం సచివాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. వారి సూచన మేరకు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

నీతి కథలతో నైతిక విలువలకు పునాది



విద్యార్థులకు కథలపై అవగాహన కల్పిస్తున్న కవి నరసింహమూర్తి, రచయిత్రి సుధ

అమలాపురం టౌన్: నీతి కథలు చదవడం, వినడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలకు పునాదులు ఏర్పడతాయని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో 14వ రోజు ఆదివారం విద్యార్థులు నీతి కథలు చదివే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కవి నరసింహమూర్తి 'నీతి కథలు చదవడం–నైతిక విలువలు పెంపొందించుకోవడం' అనే అంశంపై ఉపన్యసించారు. రచయిత్రి పచ్చిగోళ్ల సుధ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు జల్లి సుజాత తదితరులు ప్రసంగించారు.

ప్రాణాలు పోతున్నా.. కనువిప్పు కలగదా..



జాతీయ రహదారి 216పై పరిమితికి మించి జనాన్ని ఎక్కించుకుని వెళుతున్న ఆటో

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇటీవల జాతీయ రహదారి 216లో కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ వద్ద ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది చనిపోగా, మరో ఆరుగురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణాలేవైనా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఉండడం వల్లే అధికంగా ప్రాణ నష్టం జరిగిందన్నది జగమెరిగిన సత్యం. అయినా కొంతమంది ఆటోవాలాలు నలుగురు ప్రయాణించాల్సిన చిన్న సైజు ఆటోల్లో ఎనిమిది నుంచి పదిమందిని, ఆరుగురు ప్రయాణించాల్సిన పెద్దసైజు ఆటోల్లో 12 నుంచి 15 మంది వరకూ ఎక్కించుకుంటున్నారు. ప్రమాదం జరిగి వారం రోజులు కాకుండానే ఆటోలలో అధిక సంఖ్యలో కార్మికులను తరలించడాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. ఇకనైనా ఆటోలు, వాహనాల్లో పరిమితికి మించి జనాన్ని తరలించకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాళ్లరేవులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తాళ్లరేవు: బాల్యంలో కలిసిమెలిసి చదువుకున్న వారంతా ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా కలిసి తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న తడవుగా ఒక చోటకు చేరి ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా సుమారు 23 ఏళ్ల అనంతరం ఆదివారం కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తోటి స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఏఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి నాగేశ్వరరావు, డింగిరిభట్ల రాంబాబు ఆచార్యులు, సురేష్ భూషానం, గోపాలకృష్ణమూర్తి, కామేశ్వరరావులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.



భీమనపల్లి పాఠశాలలో కలుసుకున్న 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

భీమనపల్లిలో ఆత్మీయ కలయిక

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1983–1984లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు. దాదాపుగా నాలుగు దశాబ్దాల తర్వాత స్థానిక పాఠశాలలో ఆదివారం వారంతా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగి తేలారు. ఈ సందర్భంగా వారికి విద్యను నేర్పిన 12 మంది ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగారంటూ అధ్యాపకులంతా సంతోషం వ్యక్తం చేశారు. అవివాహితగా ఉండిపోయిన తమ తోటి విద్యార్థిని కడిమి సుబ్బలక్ష్మి కోసం స్నేహితులంతా కలిసి పక్కా భవనాన్ని నిర్మించి ఇవ్వడాన్ని ఉపాధ్యాయులంతా అభినందించారు. తమతో పాటు చదువుకుని సమాజంలో పేరు ప్రఖ్యాతలు గడించిన ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జన్ పోతుల దుర్గాప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ కలయికలో మాజీ జెడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మహ్మద్ నజీర్, జిన్నూరి మాచరయ్యనాయుడు, యాళ్ల శ్రీను, సబ్బితి ఫణిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.